పొదరిల్లు, జనవరి – 1976, పుట : 40-44,  జి. రామలక్ష్మి - హైదరాబాదు

## సోమయ్య తెలివి

ఒక ఊళ్ళో సోమయ్య అనే ఒక యువకుడున్నాడు. అతడు చాలా అందమయినవాడూ, చాలా తెలివైన వాడూ. అతనికి దిక్కూ, మొక్కూ, ఎవరూ లేనందువలన అతని మేనమామ సోమయ్యను పెంచి పెద్దచేసి, తన కూతురు లలితనిచ్చి పెళ్ళిచేసి, తనకున్న రెండెకరాల పొలాన్నీ సోమయ్యచేత దున్నించీ, సాగుచేయించేవాడు. సోమయ్యచేతి చలువ వలన ప్రతి ఏడూ పంటలు బాగానే పండుతూండేవి. ఇలా వుండగా, ఒకసారి సోమయ్య పొలాన్ని సాగుచేస్తూ ఉండగా యిద్దరు ప్రక్క పొలాల రైతులు, సోమయ్యకు కొద్ది దూరంలో నిలబడి, ''అదేమిట్రా?... సోమయ్యకి పనీపాటాలేదా ఏం? .... మేనమామ పొలాలను దున్నుతూ కూర్చున్నాడు! అసలు నాకు తెలీకడుగుతా, వీడికి ఏం చూసి పిల్లనిచ్చాడంటావ్? నీకు తెలవదా ఏం? పిల్లనిచ్చి పెళ్ళిచేస్తే, తన పొలాలకు రైతుగా పడుంటాడని, ఎత్తేసి పెళ్ళి చేశాడు. అసలు మొగాడుగా వీడికేమయినా పౌరుషముంటే, కనీసం పిడికెడంతయినా పొలాన్ని సంపాదించుకునేవాడు.'' అన్నాడు రెండవ రైతు. అది విన్న సోమయ్యకి, పట్టరానంత కోపమూ, చెప్పలేనంత పౌరుషమూ వచ్చింది. ఎలాగయినా తనదీ అన్న పొలాన్ని, ఆస్తినీ సంపాదించుకోవాలని అనుకుని అప్పటికప్పుడే ఆ వూరి లక్షాధికారి, ధర్మాత్ముడు. వందెకరాల మాగాణిగల పెద్ద జమీందారు యింటికి వెళ్ళాడు. జమిందారుకు నమస్కారం చేసి, తను వచ్చిన పని చెప్పి, తనకు కావలసిన సహాయం అడిగాడు. అది విని ఆ జమీందారు, కావాలంటే నీకు మూడెకరాల బంజరు భూమి యిస్తాను. ఆ భూమిలో పంటలు పండిరచుకోగలవా?'' అని అడిగాడు. అది విని సోమయ్య ''మీరిచ్చేది బంజరు భూమయినా పర్వాలేదు. నేను దానినే కష్టపడి, సాగుచేసి, బ్రహ్మాండంగా పంట పండిరచుకోగలను. నాదీ అన్నది, పిడికెడంత భూమయినా, బంజరు భూమయినా పర్వాలేదు'' అన్నాడు వినయంగా చేతులు కట్టుకుని అది విని జమీందారు, ''శభాష్! యువకుడంటే అలా వుండాలి,'' అనీ సోమయ్యను మెచ్చుకుని అప్పటికప్పుడే మూడెకరాల బంజరుభూమిని సోమయ్య పేర రాసిచ్చాడు.

ఆ మరునాడు నుంచే సోమయ్య, తన పొలాన్ని కష్టపడి దున్ని సాగుచేసి, కాలువల ద్వారా నీళ్ళు రప్పించి, వరి గింజలు నాటడం మొదలు పెట్టాడు. సోమయ్య వరి గింజలు నాటుతున్న సమయంలో, అక్కడికి ఆ వూరంతటికీ పెద్ద పేరు మోసిన జూదరీ, తాగుబోతూ, కట్టురౌడి అయిన, రత్తన్న అనేవాడు వచ్చి, ''ఏం సోమయ్యా, బంజరు భూమినే, సాగుచేసి, పంటలు పండిరచేస్తున్నావా?...? వారెవ్వా! పట్టుదల అంటే అలా వుండాలి...., సరేకానీ, పంటలు పండగానే, అవి మాయింట్లో పడేసి, నీ కూలి తీసుకుపో,'' అన్నాడు. అది విని

సోమయ్య ఆశ్చర్యపోయి, ''ఏమిటీ? పంటలు పండిరచీ, నీ యింట్లో పడెయ్యాలా? యిదీ మరీ బాగుంది. నా పొలాలను నేను కష్టపడి సాగుచేసుకుని, పంటలు పండిరచుకుంటే, మధ్య నీ పెత్తనమేమిటయ్యా, వెళ్ళు, వెళ్ళు'' అన్నాడు.

అది విని రత్తన్న, కోపంతో, ''నన్నే వెళ్ళు వెళ్ళు అంటావా? నే నెవరనుకున్నావు? యీ వూరికి పేరు మోసిన కట్టు రౌడీని. అంతేకాదు యీ పొలానికి అధికారిని నువ్వు దున్నే యీ పొలం నాది, నా పొలంలో పంటలు పండిరచుకునే అధికారం నీకెవరిచ్చారు?'' అన్నాడు.

''ఈ పొలం నీదేం కాదు. దీనిని జమీందారుగారు, నాకు దానముచేశారు. కావాలంటే అడుక్కోపో!'' అన్నాడు ధైర్యంగా.

''నా పొలాన్ని దానం చేయటానికి వాడెవడు? మర్యాదగా నా పొలాన్ని నాకు వదిలేస్తావా, లేక పండిన పంటలో సగం భాగం యిస్తావా? అడిగాడు రత్తన్న గట్టిగా. సోమయ్య కొంచెం సేపు ఆలోచించీ, ''సరే నీకు పంటలో సగం భాగం యిస్తాను. యిప్పుడే చెప్పుకో. నీకు పంటలో ఏ భాగం కావాలి? పై భాగమా? కింది భాగమా? ఏది కావాలి'' అన్నాడు. తన బెదిరింపులకు సోమయ్య లొంగిపోయాడని, సంతోషించి, రత్తన్న కొంచెంసేపు బాగా ఆలోచించి ''నాకు క్రింది భాగమే కావాలి. నువ్వు పై భాగము తీసుకో'' అన్నాడు. అది వినీ సోమయ్య సరే అన్నాడు. తర్వాత వరి విత్తనాలు వేసి, పంటలు బాగా సమృద్ధిగా పండిరచీ, పైభాగమంతా తను తీసుకుని, క్రింది భాగమంతా, అంటే క్రింది భాగములో ఉండే వ్రేళ్ళను మాత్రమే తీసి, కుప్పగాచేసి రత్తన్న యింటికి పంపాడు. అది చూసి, రత్తన్న మండిపడి, వెంటనే సోమయ్య ఇంటికి పరుగు, పరుగున వచ్చి ''సోమయ్యా, యిది న్యాయమేనా? పై భాగంలో ఉండే వరి పంట అంతా నువ్వు తీసుకుని, క్రింది భాగంలో ఉండే వ్రేళ్ళను మాత్రం నాకు యిస్తావా?'' అన్నాడు కోపంగా.

''అదేమిటి రత్తన్నా ఆనాడు నువ్వు కోరుకున్నదేగా యిచ్చాను!.... మధ్య నా తప్పేం ఉంది? పోనీ, యీ సారి ఏ భాగం కావాలో ముందే చెప్పుకో!'' అన్నాడు మర్యాదగా. రత్తన్న మళ్ళీ, తన తెలివినంతా ఉపయోగించి బాగా ఆలోచించి, యీసారి నాకు పైభాగం కావాలి'' అన్నాడు సోమయ్య. ఈసారి కూడా సరే అన్నాడు. తర్వాత సోమయ్య చెరుకు పంట వేశాడు. చెరుకు పంట కూడా బాగా సమృద్ధిగా పండిరది. తర్వాత సోమయ్య పై భాగమంతా కోసి, కుప్పగా చేసి, రత్తన్న యింటికి పంపాడు. క్రింది భాగమంతా, తను తీసుకున్నాడు. రత్తన్న తనకు వచ్చిన భాగాన్ని చూసి, మండిపడి, మళ్ళీ సోమయ్య దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. ''ఏమిటి, సోమయ్యా? యింత అన్యాయం చేశావు? నాకు చెరుకు గడలకు, పైన భాగంలో ఉండే ఆకులను మాత్రం

పంపించి, నువ్వు క్రింది భాగంలో ఉండే ఉన్న చెరుకు పంట అంతా తీసుకుంటావా? నీకు కొంచెమయినా న్యాయం ఉందా?'' అన్నాడు కోపంగా. అది విని సోమయ్య ''యిందులో నాతప్పేం లేదు. నువ్వే పైభాగం కావాలని కోరావు'' అన్నాడు నిదానంగా. ''అయితే యీసారి నాకు పైభాగం, క్రింది భాగం రెండూ కావాలి. నువ్వు మధ్య భాగం తీసుకో!'' అన్నాడు. ''సరే నీ యిష్టం'' అన్నాడు సోమయ్య. ఈసారి సోమయ్య, మొక్కజొన్న పంట వేశాడు. ఆ పంట కూడా బాగా సమృద్ధిగా పండిరది. ఈసారి కూడా రత్తన్న కోరుకున్నట్లే, మొక్కజొన్నకు పై భాగంలో ఉండే, పీచులాంటి భాగమూ, కింది భాగంలో ఉండే వ్రేళ్ళలాంటివి కోసి, కుప్పచేసి, రత్తన్న యింటికి పంపీ, మధ్య భాగంలో ఉండే మొక్కజొన్న పొత్తులను తన భాగంగా తీసుకున్నాడు సోమయ్య. ఈ సారి కూడా రత్తన్నకి పట్టలేనంత కోపం వచ్చింది. వెంటనే సోమయ్య దగ్గరకు వచ్చి, ''సోమయ్యా! మూడు పండల నుంచీ, నన్ను మోసం చేస్తున్నావు. చెత్త భాగం అంతా నాకూ, మంచి భాగం అంతా నీకూ తీసుకుంటున్నావు. యిదేమీ న్యాయంకాదు. మర్యాదగా నా పంట నాకు పడెయ్యి'' అన్నాడు కోపంగా.

''రత్తన్నా, అనవసరంగా, నా పొలాలను, నీ పొలాలని చెప్పి, నన్ను నమ్మించి, నన్ను బెదిరించి, నేను పండిరచే పంటనంతా గుంజుకోవాలని చూశావు. తెలివి నీ ఒక్కడి సొమ్మేకాదు రత్తన్నా! తెలివన్నది అందరి సొమ్మూ.... గుర్తుంచుకో.... అందుకే, నీవు కోరుకున్న దానికి అనుగుణంగా నేను పంటలను మారుస్తూ వచ్చాను. యిక ముందు నుంచీ, నా పంటలో నీకు ఏ భాగమో లేదు'' అన్నాడు సోమయ్య ఖచ్చితంగా. సోమయ్య తెలివికి, రత్తన్న ఆశ్చర్యపోయాడు. ఇంక చేసేదిలేక, ''సోమయ్యా, నాకు బాగా బుద్ధి వచ్చింది. ఇక ముందు నీ పొలంలో నాకే భాగమూ వద్దు అమోఘమయిన నీ తెలివితేటలను యిన్నాళ్ళూ తెలుసుకోలేక పోయాను.'' అని తన దారిన తాను వెళ్ళిపోయాడు.